



# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక








సంపుటి: 01 సంచిక : 260. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.04.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00


# సంక్షేమం పేదల గుడిసెల వరకు చేరాలి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: "సంక్షేమ పథకాలు పేదల గుడిసెల వరకు చేరాలి. ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి అమలు బాధ్యత కలెక్టర్లదే" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో నిర్మల్, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, వనపర్తి జిల్లాల కలెక్టర్లతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామనీ, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధికారులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. చట్టాన్ని రూపొందించడం వరకే పరిమితం కాకుండా, అది అర్హులందరికీ అందేలా పని చేయాలని కోరారు. "భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వండి. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్యుడు సైతం సంతోషపడేలా యంత్రాంగం పనిచేయాలి. ఇందిరమ్మ ఇండ్లకు ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నాం. లబ్దిదారుల ఎంపిక, ఇండ్ల మంజూరు, నిర్మాణ పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన ఈ రెండు పథకాలు పక్కదారి పట్టకుండా నిఘా పెట్టాలి. అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నా రద్దు చేయడానికి వెనుకాడొద్దు. ప్రతి ఇల్లు అర్హులకే అందాలి. ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలి. నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ ఇటుకల కోసం మండల స్థాయిలో ధరల కమిటీలు ఏర్పాటు చేయండి" అని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దేశానికే మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజ్‌మెంట్

దేశానికే రోల్ మోడల్‌గా ఉండేలా విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో గోదావరి, కృష్ణా నదీ పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో చీఫ్ సెక్రెటరీ కె. రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్‌తో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని ఐఎండీతో సమన్వయం చేసుకుని పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. "వరద ఉధృతి వస్తే ముంపునకు గురయ్యే గ్రామాల సమాచారాన్ని నీటిపారుదల శాఖ ముందుగానే అందించాలి.

ఇతర రాష్ట్రాల్లో వచ్చే వరద వివరాలు, స్థానికంగా కురిసిన వర్షం, ఎంత నీటిని విడుదల చేశారనే విషయాలు సవివరంగా ఉండాలి. నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులను వరదలు వచ్చిన ప్రతిసారీ సురక్షిత ప్రాంతాలకు తరలించడం కంటే వారికి శాశ్వత నివాసం కల్పించాలి. ఇందుకు సంబంధించి నివాసితుల వివరాలను గుర్తించండి. అదనపు కోటా కింద ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తాం" అని పొంగులేటి తెలిపారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వాగులు, చెరువుల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఆ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల గతేడాది పాలేరులో చిక్కుకున్న బాధితులను రక్షించు కోలేకపోయామని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్ లిఫ్ట్ మెకానిజం ఏవిధంగా ఉండాలి? విపత్తు సంభవించిన ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి? వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

# హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్‌ను మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఆయన ఏఐజీ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నట్టు తెలిపారు. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్ గా ఉంటుందని చెప్పారు. హెల్త్ టూరిజంలో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారునిగా నియమించినట్టు తెలియజేశారు. హెల్త్ టూరిజంగా మార్చే ప్రభుత్వ ప్రయత్నంలో భాగస్వామి కావాలని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కోరారు.

ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నదని గుర్తుచేశారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టేందుకు సరైన విధానంతో ముందుకెళ్తున్నట్టు సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్న వివిధ ప్రభుత్వాస్పత్రులు ప్రారంభమైతే మరో 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ప్రత్యేకంగా హెల్త్ ప్రొఫైల్ కార్డులను అందజేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని వివరించారు. గతంలో ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థ ఉండేదనీ, ప్రస్తుతం స్పెషలిస్టు డాక్టర్ల రోజులు వచ్చాయని తెలిపారు.

ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నా మని చెప్పడానికే మిస్ వరల్డ్ పోటీదారులకు ఏఐజీ ఆస్పత్రి సందర్శన వంటి కార్యక్రమాలు చేపట్టినట్టు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కార్పొరేట్ ఆస్పత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తామని తెలిపారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11,500 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమాలకు



ప్రయివేటు వైద్యులూ సహకరించాలని కోరారు. ఏడాదిలో ఒక నెల రోజులపాటు సామాజిక బాధ్యతగా ప్రభు త్వాస్పత్రుల్లో సేవలందించాలన్నారు. పశ్చిమా సియా దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నట్టు తెలిపారు.

హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. ఆయన హైదరాబాద్‌కు, తెలంగాణకు గొప్ప పేరు తెచ్చారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తుచేశారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్న అవార్డుకు అర్హులని అభిప్రాయపడ్డారు. భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. 66 దేశాల నుంచి రోగులు ఏఐసీ ఆస్పత్రిలో చికిత్స కోసం రావడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గించిందే కేసీఆర్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గించారని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉండి ఆయన బీసీలకు ఏం సాధించారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఖర్గేకు లేఖ రాయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఆ లేఖ జాగృతి తరుపున రాశారా? లేక బీఆర్ఎస్ పార్టీ తరుపున రాశారా? ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్థానిక సంస్థలతోపాటు విద్య, వైద్య రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేసిందని గుర్తు చేశారు. ఆపార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించే సమయంలో కవిత లిక్కర్ కేసులో జైల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో విఫలమైనందు వల్లే బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని తెలిపారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. శుక్రవారం ఎల్బీస్టేడియంలో తలపెట్టిన సామాజిక సమరభేరి సభకు గ్రామ, మండల, జిల్లా అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,



వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లతో సహా 40వేల మంది హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఖర్గే గ్రామ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేస్తారని ఆయన తెలిపారు.

# తుది దశకు చేరిన కులగణన అధ్యయనం

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో చేపట్టిన కులగణన అధ్యయన నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందించనున్నట్టు స్వతంత్ర నిపుణుల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో సమా వేశమై తుది నివేదికపై చర్చించినట్టు పే ర్కొంది. కులగణనలో పేర్కొన్న 242 కులాలకు వెనుకబాటుతనం పై కంపొజిట్ బ్యాక్‌వర్డ్ నెస్ ఇండెక్స్ (సీబీఐ) సూచీని నివేదికలో పొందుపర్చామని పేర్కొన్నారు. సమావేశంలో నిపుణుల కమిటీ వైస్ చైర్మెన్ కంచ ఐలయ్య, కన్వీనర్ ప్రవీణ్ చక్రవర్తి, సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, డాక్టర్ సుఖ్‌దేవ్ థొరోట్, డాక్టర్ హిమాన్షు, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భుక్య, ప్రొఫెసర్ పురుషోత్తమ్ రెడ్డి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పాల్గొన్నారు.




# ఫీజు బకాయిలు విడతల వారీగా చెల్లిస్తాం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడతల వారీగా చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉన్నత విద్యా కాలేజీ యాజమాన్యాల సమాఖ్య (ఎఫ్ఏటీహెచ్ఐ) ప్రతినిధులు భట్టి విక్రమార్కను కలిసి ఫీజు బకాయిలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్, లా, నర్సింగ్ తదితర కాలేజీలకు మూడేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.వేల కోట్లు పేరుకుపోయాయని తెలిపారు. దీనిపై వివరంగా ఉపముఖ్యమంత్రితో వారు చర్చించారు. ఈ సందర్భంగా సమాఖ్య చైర్మెన్ నిమ్మటూరి రమేష్‌బాబు వివిధ గణాంకాలతో ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలకు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి



ఆర్థిక భారం లేకుండా ఎలా చెల్లించొచ్చో ప్రత్యేక ప్రత్యామ్నాయ ప్రణాళిక గురించి వివరించారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ ఈనెల ఏడో తేదీన సచివాలయంలో సంబంధిత మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అధికారిక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు హామీ ఇచ్చారు. ప్రస్తుతం డిగ్రీ తుది సంవత్స రం పూర్తి చేసిన విద్యార్థులకు నాలుగేండ్లపాటు ఉన్న ఫీజు బకాయిలను, దాంతో పాటు వివిధ కాలేజీలకు మంజూరు చేసిన టోకెన్ మొత్తాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఫ్ఏటీహెచ్ఐ ప్రతినిధి బృందం ఉప ముఖ్య మంత్రిని కోరింది. ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొంది. ఈ కార్య క్రమంలో ఏఫ్ఏటీహెచ్ఐ ప్రతినిధులు కొడాలి కృష్ణారావు, ప్రదీప్‌రెడ్డి, కె రామదాస్, సునీల్‌కుమార్, సరస్వతీ రమేష్, కోదాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మిలింద్ ప్రకాశన్ సంచాలకులు విభా భారతి మృతి బాధాకరం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మిలింద్ ప్రకాశన్ ప్రచురణ సంస్థ సంచాలకులు, హిందీ పుస్తక ప్రపంచంలో పండితులు, సమాజ సేవకులు విభా భారతి(83) మృతి బాధాకరమని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ పేర్కొంది. సంతాపాన్ని ప్రకటించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. బుధవారం ఈ మేరకు బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు కె.బాల్‌రెడ్డి, శోభన్‌బాబు, సంయుక్త కార్యదర్శులు సూరిబాబు, సురేశ్, కోశాధికారి నారాయణరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నగరంలో హిందీ పుస్తకాలకు చిరునామాగా మిలింద్ ప్రకాశన్ సంస్థను తీర్చిదిద్దడంలో శృతికాంత్, విభాభారతి కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ప్రముఖ ప్రచురణ సంస్థల హిందీ పుస్తకాలను పంపిణీ చేస్తూ ప్రజల అందుబాటులోకి మిలింద్ ప్రకాశన్ తీసుకొచ్చిందని కొనియాడారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ నిర్వహణలో భారతి దంపతులిద్దరూ చురుకుగా పాల్గొనేవారని గుర్తుచేశారు. బుక్‌ఫెయిర్ సంయుక్త కార్యదర్శిగా విభా భారతి చాలా ఏండ్ల పాటు విశిష్ట సేవలందించారని తెలిపారు. ఆమె కాచిగూడలోని తన స్వగృహంలో మంగళవారం చనిపోయారని పేర్కొన్నారు. సొసైటీ తరఫున ఆమె మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జూలూరు గౌరీశంకర్ సంతాపం

విభా భారతి మరణం పట్ల తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మెన్ జూలూరీ గౌరీశంకర్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్



మాజీ కార్యదర్శి కె.చంద్రమోహన్ సంతాపం ప్రకటించారు. ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సిగాచి దుర్ఘటనలో లభించని 10 మంది ఆచూకీ

మెదక్ :అమృత్ తెలంగాణ: సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన భారీ ప్రమాదంలో 10 మంది ఆచూకీ ఇంకా లభించలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు నాలుగు రోజులుగా తమ వారి కోసం వెతుకుతూనే ఉన్నారు. మృతదేహాలను గుర్తించడంలో జాప్యం జరగడంతో మార్చురీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. పాశమైలారం కంపెనీ వద్ద రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నప్పటికీ ఆచూకీ లేని తమ వాళ్ల కోసం ఎదురు చూస్తున్న కుటుంబీకులు, బంధువులను అక్కడ ఉండకుండా గురువారం కంపెనీ యాజమాన్యం గెంటి వేసింది. దీంతో బాధిత కుటుంబీకులు కంపెనీ ఎదుట ఆందోళనకు దిగారు. తమ వాళ్ల ఆచూకీ కోసం కంపెనీ వద్ద ఎదురు చూడటం, హెల్ప్‌లైన్ వద్ద సమాచారం అడిగినా అధికారులు, కంపెనీ ప్రతినిధుల నుంచి సరైన సమాచారం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీడియా వాళ్లకైనా తమ గోసను వెల్లడించేందుకు యత్నించగా కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన మీడియా పాయింట్‌ను పోలీసులు ఎత్తేశారు. అయితే ఘటన జరిగిన ప్రాంతం పక్కనే మీడియా ఉండటం వల్ల ఆచూకీ లేని వారి సమస్యను ఎక్స్‌పోజ్ చేస్తున్నారన్న నెపంతో మీడియా వాళ్లను ప్రమాదం జరిగిన కంపెనీ పరిసర ప్రాంతాల్లోకి రానివ్వట్లేదు. కాగా శిథిలాల తొలగింపులో కొన్ని శరీర



భాగాలు దొరికాయి. అయితే అవి ఎవరివనేది ఫోరెన్సిక్ పరీక్షలు చేశాక నిర్ధారించాల్సి ఉంది. తమ వాళ్లు బతికున్నారా? లేక చనిపోయారా? సమాచారం చెప్పకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిల్లో బంధువులు పడిగాపులు కాస్తున్నారు. చనిపోతే కనీసం మృతదేహాలైనా అప్పజెప్పాలంటూ వేడుకుంటున్నారు.

ప్రమాదంపై నిపుణుల కమిటీ విచారణ

సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన భారీ ప్రమాదంలో ఇప్పటి వరకు 42 మంది చనిపోవడం, 10 మంది ఆచూకీ లభించకపోవడంతో ప్రభుత్వ విచారణ కోసం నిపుణుల కమిటీ వేసిన విషయం విధితమే. ఇందులో భాగంగా గురువారం మధ్యాహ్నం కమిటీ చైర్మెన్ వెంకటేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు ప్రతాప్, సూర్యనారాయణ, సంతోష్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల పరిస్థితుల్ని పరిశీలించారు. కారణాలను విశ్లేషించడంతో పాటు కార్మికుల భద్రతకు నిబంధనలు పాటించారా..? లేదా అనే విషయాలపై ఆరా తీశారు. పేలుళ్లకు గల కారణాలేమిటీ..?

ఇలాంటి భారీ ప్రమాదం పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన నివేదికను నెల రోజుల్లో ఇవ్వాల్సి ఉంది. కాగా, బృందం రెండు గంటల పాటు ఘటనా స్థలంలో శాంపిళ్లను సేకరించింది. ప్రమాదం గురించి అధికారులతో మాట్లాడింది. కంపెనీలో కలియ తిరిగిన కమిటీ.. బాయిలర్‌లో ఒత్తిడితో ప్రమాదం జరిగిందా..? అన్న కోణంలో దర్యాప్తు చేసింది. ప్రమాదం తీరు, ప్రమాదానికి గల కారణాలకు సంబంధించిన విషయాలను అన్వేషించింది. డ్రయ్యర్, రియాక్టర్‌కు సంబంధించిన అంశంలో ఏమైనా లోపాలు జరిగాయా..? సాంకేతిక కారణాలేమైనా ఉన్నాయా..? అనేది పరిశీలించడం కోసం కొన్ని ఆధారాల్ని సేకరించినట్టు తెలుస్తోంది.

# ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి - ఐటిడిఏ పిఓ ఖుష్బు గుప్త





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్త ఆకస్మికంగా సందర్శించారు. వంటగది, స్టోర్ రూమ్, రికార్డులను పరిశీలించి పిఓ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలిక సదుపాయాలు, భోజన ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని పి ఓ ఆదేశించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్శనలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాలశక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : బాలశక్తి కార్యక్రమం కింద గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్డిఎం మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఆర్థిక వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ వ్యవస్థ, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, పొదుపు అలవాట్లు వంటి అంశాలు ఆర్థిక అక్షరాస్యతలో భాగమని వివరించారు. బ్యాంకుల్లో వాడే వివిధ ఫారముల వాడుక, రుణాల ప్రక్రియ, సివిల్ స్కోర్ ప్రాముఖ్యత, విద్య, వాహనం, గృహ రుణాల అవసరాల గురించి విద్యార్థులకు వివరించారు. చిన్న వయస్సులో నుంచే చిన్నచిన్న పొదుపులను అలవాటు చేసుకొని భవిష్యత్తును ఆర్థికంగా నిర్మించుకోవాలని అన్నారు. సాంకేతిక యుగంలో ఆర్థిక నేరాల పెరుగుదల దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ, మిషన్ సాథి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సబిత, మౌనిక, ఉపాధ్యాయులు రామేశ్ గౌడ్, రాజేశ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా సౌర గిరిజల వికాస పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయండి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిల్లాలో ఇందిరా సౌర గిరిజల వికాస పథకంను విజయవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి (పీవో) కుష్బూ గుప్తా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పథకం కింద గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఉచితంగా బోర్లు తవ్వించి, సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం లభించడంతో పాటు వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని చెప్పారు. గిరిజన గ్రామాల్లో వ్యవసాయ అవసరాల కోసం నీటి వనరుల అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో తోడ్పడుతుందని, ప్రతి హబిటేషన్‌కు తగిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పథకం అమలులో భాగంగా, మండల స్థాయిలో ఎంపీడీవో అధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, అలాగే నియమ నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఐటిడిఏ పీవో కుష్బూ గుప్తా మాట్లాడుతూ, లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని, కమిటీలు అర్హులను గుర్తించి వారికి తగిన పరికరాలు అందజేయాలన్నారు. సాగునీటి సదుపాయం కలిగిన రైతులు వాణిజ్య పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి పంటలను సాగుచేసేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎఫ్ఓ నాగిని భాను, జడ్పీ సీఈఓ గోవింద్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, జిల్లాపంచాయతీ అధికారి శ్రీనివాస్,ఉద్యాన వనశాఖ అధికారి రమణ,ఎంపీడివోలు, పాల్గొన్నారు.

# జైనథ్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) నీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం ఆకస్మిక తనఖీ




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి అదిలాబాద్ జిల్లా గురువారం జైనథ్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) నీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం ఆకస్మికంగా సందర్శించి ఫెర్టిలిజర్ స్టాక్ నీ పరిశీలించారు ఎరువులు ప్రస్తుతం నిలువ ఉన్న యూరియా DAP నీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది అలాగే రైతులకు అవసరమైన ఎరువులను ఎల్లప్పుడు సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆదేశించడం జరిగింది తనిఖీ లో భాగంగా కలెక్టర్ వెంట PACS చైర్మన్ బాలురీ గోవర్ధన్ రెడ్డి , మండల వ్యవసాయ అధికారి పూజ జంగమ్వర్ , CEO AEO , రైతులు , తదితరులు పాల్గొన్నారు. అనంతరం జైనథ్ KGBV ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు మెనూ ప్రకారం అందిస్తున్న ఆహారం వివరాలు, వంటగది, తదితర పరిశీలించి, విద్యార్థులతో భోజనం చేస్తూ ముచ్చటిస్తూ బాగా చదువుకోవాలని మళ్ళీ కేజీబీవి సందర్శించినప్పుడు మీరు నేర్చుకున్న అభ్యాస సామర్థ్యాల పై, ఇంగ్లీష్ లో మాట్లాడడం, చదవడం పై అడిగి తెలుసు కుంటానని అన్నారు. చదువు పై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఆరోగ్య పాఠశాల లో పొందుపరిచిన ఆరు సూత్రాల పైఅవగాహన చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాద్యాయులు, తదితరులు ఉన్నారు.

# జీపీ సెక్రటరీ వివాహేతర సంబంధం.. దేహశుద్ధి

చేర్యాల: అమృత్ తెలంగాణ: భార్య ఉండగా వేరొక మహిళతో సహజీవనం కొనసాగిస్తున్న పంచాయతీ కార్యదర్శిని అతని భార్య రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన చేర్యాల పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. కార్యదర్శి ఏటి బాబు భార్య జ్యోతి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రానికి చెందిన ఏటి బాబు సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, కూతురు, కొడుకు ఉండగా భార్య అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వహిస్తోంది. భార్యా భర్తల మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. కొంత కాలంగా ఆంధ్రాకు చెందిన ఒక మహిళతో సహజీవనం కొనసాగిస్తూ చేర్యాల మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. భర్త పై అనుమానం వచ్చిన భార్య తన బంధువులతో కలిసి గురువారం బాబు నివాసం ఉంటున్న ఇంటి వద్దకు వెళ్ళి ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని దేహశుద్ధి చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఇరువురిని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# శ్రీ శివాలయం నిర్మాణం కొరకు ప్రొసిడింగ్ కాపీ అందజేత


## అందజేసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



త్వరితగతిన టెంపుల్ కొరకు నిధులు మంజూరు చేయించిన విట్టల్ రెడ్డి,కీ సన్మానిస్తున్న మండల ప్రజలు

నిర్మల్ జిల్లా బైంసా జులై 3 అమృత్ తెలంగాణ బైంసా మండలంలోని ఖుంసార గ్రామంలో శ్రీ శివాలయం యొక్క ప్రొసీడింగ్ కాఫీని గురువారం గ్రామస్తులకు అందచేయటం జరిగింది. ప్రొసీడింగ్ కాపీ మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి దేవాదాయ శాఖ మంత్రి, కొండా సురేఖ,కు నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి విట్టల్ రెడ్డి కి,ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు. ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా zp వైస్ చైర్మన్ రాజన్న, మాజీ సర్పంచ్ ప్రవీణ్, మోతిరం, రాకేష్ రెడ్డి ప్రసాద్, భూమన్న నాందేవ్, మహేష్ ఉన్నారు.

# పెన్షన్లు ఏ ఆధారం లేని వారికి భద్రత కలిగిస్తుంది..



సూర్యాపేట :అమృత్ తెలంగాణ: పెన్షన్లు ఏ ఆధారం లేని వారికి భద్రత కలిగిస్తాయని, పెన్షన్ల పంపిణి పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో చేయూత పథకంపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఒలు, పంచాయతీ సెక్రటరీలు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏ ఆధారం లేని వారికి పెన్షన్ అందిస్తే వారిని ఆదుకున్న వారమవుతామని అధికారులు పెన్షన్ల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని, వృద్ధులకు వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం ద్వారా పంపిణీ చేస్తున్న పెన్షన్లలోఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. పింఛన్లకు సంబంధించి ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీ లాగిన్ లో ఉన్న వివరణ ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు చనిపోయిన వారి వివరాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలోపరిశీలించి ఆన్లైన్లో అప్డేట్ చేయాలన్నారు, ప్రత్యేకించి వృద్ధాప్య పెన్షన్లలో చనిపోయిన వారి పేర్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఆన్లైన్లో జాబితా నుండి తొలగించాలని, ఒకవేళ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు ఉంటే స్పష్టంగా పేర్కొనలని ఆదేశించారు. చనిపోయిన వారి స్థానంలోవారి భార్య లేదా భర్తకు పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తపాలా కార్యాలయాలలో కూడా పెన్షన్ల పంపిణీ జాగ్రత్తగా ఇవ్వాలని పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగనేకుండాచూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపీడీవోలు మండలాలలో నిర్వహించే సమావేశాలలో చనిపోయిన పెన్షన్ల తొలగింపు పై చర్చ జరగాలని తెలిపారు. పంచాయతీ సెక్రటరీలు పెన్షన్ల పంపిణీ జరిగేటప్పుడు తప్పక పరిశీలించాలని తెలిపారు. లబ్ధిదారుడికి మొత్తం అందేలా చూడాలని పెన్షన్లు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాలని అలాగే గ్రామాలలో తప్పనిసరిగా మరణ రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు. అర్హులకు నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం ద్వారా ఆర్థిక సాయంఅందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ వీవి అప్పారావు, డిఎల్పిఓ నారాయణరెడ్డి, పోస్టల్ సూపర్డెంట్ వివెంకటేశ్వర్లు, జె పిఎం రవి,టిసిఎస్అధికారిలోకేష్ అధికారులుసిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ



పెద్దవూర : అమృత్ తెలంగాణ: మండలం లోని జెడ్పి హెచ్ ఎస్ పెద్దగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బహుకరించిన మైక్ సెట్ ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు మారం రవీందర్ అన్నారు. పెద్ద గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 08 ఏండ్లు పనిన చేసి ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించారు. గురువారం తాను పనిచేసిన పాఠశాల కు తనకు గుర్తింపుగారూ. 20,000 విలువైన మైక్ సెట్ ను బహుకరించారు. ఈసందర్భంగామారంరవీందర్ మాట్లాడుతూ. ఇది విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు ఉపయోకరంగా ఉంటుంని, ముఖ్యంగా పాఠశాల కార్యక్రమాలు, సమావేశాలు,ప్రదర్శనలు,ఇతర కార్యక్రమాలలో ఉపయోగపడుతుందని అన్నారు. ఇది పాఠశాల అభివృద్ధికి ఎంతో సహాయపడుతుందని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు అందరూ రిటైర్డ్ ఉపాధ్యాయులు రవీందర్‌ను ఘనసన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు చిన నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు రేపాల అశోక్, చంద్రశేఖర్,మధుబాబు,చంద్రకళ,జంగాలఅరుణ, పాల్గొన్నారు.

# బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి..



భువనగిరి:అమృత్ తెలంగాణ: బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి, ఆపరేషన్ ముస్కాన్, ఈ నెల 31 వరకు జిల్లా లో పకడ్బందీగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ శ్రీయుత ఏ భాస్కర్ రావు సంబంధిత అధికారులను కోరారు. గురువారం రోజు మినీ మీటింగ్ హాల్ లో ఆపరేషన్ ముసా?న్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, కార్మిక, విద్యా, వైద్య శాఖ ల అధికారులతో ఆపరేషన్ ముస్కాన్, కార్యక్రమాల అమలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

బాలల హక్కులను కాపాడి వారికి మంచి భవిష్యత్తును అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. 2025-26 సంవత్సరం ప్రారంభమైన బడికి రాని పిల్లలు,మధ్యలో బడి మానేసిన పిల్లలు బాల కార్మికులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. 14 సంవత్సరాల వయసు కలిగిన బాల కార్మికులు ఏం పని చేస్తున్నారని గుర్తించినట్లయితే యజమానియాలపై కేసులు నమోదు చేసి పిల్లలకు నష్టపరిహారం అందించాలన్నారు. కార్మిక శాఖ అధికారులతో కలసి బృంద సభ్యులతో కలసి పరిశ్రమలు, దుకాణాలు, నిర్మాణ ప్రాంతాలు . హాట్ స్పాట్ ప్రదేశాలను గుర్తించిన తర్వాత హాట్ స్పాట్ ప్రదేశాలు సందర్శించి బాల కార్మికులను గుర్తించాలన్నారు.

బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవడం చట్ట రిత్యా నేరమని విషయాన్ని యజమానులకు తెలిపే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. బాల్యవివాహాలను నిర్మూలించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ ను అన్ని శాఖల అధికారుల సమన్వయతో నిర్వహించాలని పక్కా ప్రణాళిక రూపొందించుకొని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా కృషి చేయాలన్నారు. బాలల పరిరక్షణ సర్వతో ముఖాభివృద్ధికి అధికారులు తమ తోడ్పాటు అందించా లన్నారు. అనంతరం చైల్డ్ హెల్ప్ లైన్ లోగో ను ఆవిష్కరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్స్ 1098 , 112 సంప్రదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని నరసింహారావు , భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ , జిల్లా ఉప వైద్య అధికారి యశోద,అసిస్టెంట్ లేబర్ కమీషనర్ అరుణ, బీ ఆర్ బీ కో ఆర్డినేటర్.అనంత లక్ష్మి, సిడిపిఓ లు స్వరాజ్యం, వెంకట రమణ,జ్యోష్ణ, డీసీపీయు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, జిల్లా లో ఉన్న చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ సిబ్బంది పోలీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ..



వలిగొండ : అమృత్ తెలంగాణ: మండలంలోని అరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంగారెడ్డిపల్లికి చెందిన విద్యార్థినులకు విశ్రాంత ఉపాధ్యాయులు బుస్స శంకరయ్య వారి కుమారులు రమేష్, నాగరాజుల సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ చేతుల మీదుగా గురువారం సైకిల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజబాబు, చిలకమర్రి విష్ణుమూర్తి,

లత, ఆనంద్ ప్రసాద్, వీరస్వామి, శ్రవణ్, శ్రీదేవి, మంజుల, నస్రీన్ బిక్షపతి, వేలంగిని, గంజి చండీదాస్ తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రాల రిపేర్లు నిర్వహించాలి..



భువనగిరి :అమృత్ తెలంగాణ: జిల్లా కలెక్టర్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో గురువారం జరిగిన సమావేశంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కె భాస్కర్ రావు జిల్లాలోని భవిత కేంద్రాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల రిపేర్ల గురించి పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సరిపడా సౌకర్యాలు ఉ ండే విధంగా పక్కా భవనాలున్న భవిత కేంద్రాలలో రిపేర్లు చేయించాలని, నూతనంగా నిర్మించే కేంద్రాలలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల రిపేర్లలో ప్రత్యేక అధికారుల భాగస్వామ్యంతో పనులు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా బాలికలకు సరిపోను టాయిలెట్లు,నీటి సౌకర్యం , ప్రహరీ గోడ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ఏడిఎన్ ప్రశాంత్ రెడ్డి, ఈ డబ్ల్యు ఐ డి సి ఈఈ డి శైలజ, డిఈఈ శివకుమార్, ఏఈ లు,విద్యా శాఖ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుడు కిష్టయ్యకు న్యాయం చేయాలి



భువనగిరి:అమృత్ తెలంగాణ: హమాలీ కార్మికుడు కిష్టయ్యకు న్యాయం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు నల్ల నరేందర్ జిల్లా కలెక్టర్ కోరారు. గురువారం హమాలీ కార్మికుడు కిష్టయ్యను ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ వలిగొండ మండలం శుంకిశాల గ్రామానికి చెందిన మొగిలిపాక కిష్టయ్య గత 18 సంవత్సరాలుగా వలిగొండ అగ్రికల్చర్ మార్కెట్ హమాలీగా పనిచేస్తుడు. గత నెల గోదాములో లారీ లోడ్ చేస్తుండగా భద్రతా లోపం కారణంగా లారీ పై నుండి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి తరలించారు. బాధితుడు కిష్టయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో లేవలేని స్థితిలో మంచానికే పరిమితం అయ్యాడని వాపోయారు. కాగా ఈ విషయం జరిగి నెల రోజులు గడుస్తున్నపటికీ వలిగొండ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమానాయక్, సెక్రెటరీ, సూపర్ రమేష్, సివిల్ సప్లయర్ రెహమాన్, డిఎం హరికృష్ణలు ఇంత వరకు పట్టించుకున్న పాపానపోలేదని అన్నారు. నిరుపేద కుటుంబమైన కిష్టయ్యకు ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు ఖర్చు అయ్యిందని తెలిపారు. న్యాయబద్ధంగా ఆయనకు రావాల్సిన ఇన్సురెన్స్ డబ్బులు, నష్టపరిహారం ఇప్పించి కిష్టయ్య కుంటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్య కుమారుడు మొగిలిపాక శివ, శుంకిశాల మాజీ సర్పంచ్ మొగిలిపాక నర్సింహ, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కిరణ్ మహారాజ్, శ్రీకాంత్ మహారాజ్, మహేష్, కృష్ణ, వెంకటేశ్ లు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి: సీఐటీయూ




ముధోల్ : అమృత్ తెలంగాణ: ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మేన సురేష్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కూమార్ లు కోరారు. నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో డిలాక్స్ ఫంక్షన్ హాల్ లో సీఐటీయూ ముధోల్ నియోజక వర్గ స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలో సీఐటీయూ అనుబంధం సంఘాల్లో కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా కార్మికుల సత్తా చాటాలని వారు పిలుపునిచ్చారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం కలిసి సమ్మె నిర్వహించబోతున్నట్లు తెలిపారు. శతాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. ఈ చర్యలు భారత రాజ్యాంగం లో ఆర్టికల్ 19(1),ఆర్టికల్ 21,24,39(డి)కి విరుద్ధమైనదని వారు పేర్కొన్నారు. కోడ్స్ అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సమష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం చేయబడుతుందని, సమ్మె హక్కును సైతం లేకుండా చేస్తుందన్నారు. ఉద్యోగ భద్రత, ఉపాధి భద్రత కోల్పోతారుని వాపోయారు. మేలో దేశ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని 2025 మే 20 జరగవలసిన సమ్మెను 2025 జూలై 9 కి మార్పు చేసిందన్నారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు పెద్ద ఎత్తున హాజరై కార్మికుల సత్తా చాటాలని వారు కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షురాలు గంగమణి మాట్లాడుతూ.. కార్మికుల కనీసం అయితే రూ.26 వేలఇవ్వాలని, మన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికుల 3 నెలల పెండింగ్ జీతం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగమణి, ఆశ వర్కర్ జిల్లా అధ్యక్షులు బి సుజాత, ఆశ వర్కర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ,ముధోల్ నియోజక వర్గ అధ్యక్షలు ఇంద్రమాల,కార్యదర్శి సరిత, నాయకులు నందా,మౌనిక, విజయ, తెలంగాణ అంగన్వాడీ యూనియన్ సీఐటీయూ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రజియా,కార్యదర్శి రేష్మ, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి దేవరావు, ఉపాధ్యక్షులు నాగేష్, రాజు సతీష్ రతన్ సాయినాథ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగపూర్ తిరుపతి,ముధోల్ నాయకుడు గంధం, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల బాటను ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ(ఎం)



భువనగిరి:అమృత్ తెలంగాణ: రైతుల బాటను ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కిలారి మాధవరావుపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య కోరారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని జమ్మాపురం గ్రామ పరిధిలో కబ్జా చేసిన బాటను వారు పరిశీలించి , మాట్లాడారు. సుమారు 30 మంది రైతుల 70 ఎకరాల భూమికి ఉన్న బాటను జమ్మాపురం గ్రామం ఏర్పడక ముందు ఉన్నటువంటి బాటను ఇప్పటికీ ఆ గ్రామ రైతులు, గ్రామస్తులు అదే బాట వెంబడి నడుస్తున్నారు. ఈమధ్య కాలంలో కిలారీ మాధవరావు అనే వ్యక్తి , అతని అనుచరులతో కలిసి బాటను మూసివేసి గోడ నిర్మాణం చేపడుతున్నారు. బాటలో గోడ నిర్మాణం చేస్తున్న సందర్భంలో రైతులు విషయం తెలుసుకొని వారిని అడ్డుకున్నారు. వెంటనే భువనగిరి సీపీఐ(ఎం) మండల కమిటీ తరఫున జమాపురం బాటను కబ్జా చేసిన స్థలాన్ని పరిశీలించి, రెవిన్యూ అధికారులకు సమాచారాన్ని అందజేశారు. సమాచారం అందుకున్న భువనగిరి తహసీల్దార్ అంజిరెడ్డి సంబంధిత స్థలాన్ని పరిశీలించి, రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పారదర్శకంగా బాట సర్వేను పంచనామా సర్వే నిర్వహించి, గ్రామస్తులకు, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్, కొండాపురం యాదగిరి, రజక సంఘం జిల్లా కార్యదర్శి వడ్డబోయిన వెంకటేశం , రైతులు లూథియానా, ఆరోగ్యం, స్వర్ణ,లుర్తయ్య, ఆగప్ప, బల్ల రాజు,ఆంటోని,ఇన్ని సెంటు, బాలస్వామి, ఎన్నాశమ్మ, మరియమ్మ లు పాల్గొన్నారు.

# జమ్మాపురం రైతుల బాట కబ్జా..?





భువనగిరి.అమృత్ తెలంగాణ: పొలాలకు వెళ్లే దారిని మూసి వేయిస్తున్న ఘనుడు. అంగ బలం, అర్థబలం ఉన్న వ్యక్తి అవడంతో అధికారులను కూడా మ్యానేజ్ చేస్తూ తమకు ఇబ్బంది కలిగిస్తున్నాడని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం జమ్మాపురం గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేనెంబర్ 552, 561 మధ్యలో ఉన్న రైతులు వినియోగించే వందల సంవత్సరాల నాటి బాటను మూసివేసి సర్వేనెంబర్ 561 లో ఉన్న తన పొలానికి ఆనుకొని ఉన్న దారిని కిలారి మాధవరావు అనే వ్యక్తి ఫెన్సింగ్ వేస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

వివరాలను పరిశీలిస్తే 100 సంవత్సరాలకు నుంచి ఉన్న ఊరు పుట్టి నుంచి ఉన్న బాటను భువనగిరి మండలంలోని జమ్మాపురం పరిధిలో గల విత్తనాల కంపెనీ మెయిన్ రోడ్డు ప్రధాని రహదారి బాట నుంచి జమ్మాపురం గ్రామానికి బాట ఉ ందని, ఈ బాటను బాదుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రైతుల పొలాల నుంచి రాత్రిపూట డోజర్ల సహాయంతో కూర్చి వేశాడని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మార్వో కు ఫిర్యాదు చేశారు.

సుమారు వంద సంవత్సరాలకు పైగా ఉన్నటువంటి బాటను వేల ఎకరాలు ఉ న్నటువంటి ఉన్నటువంటి రియల్ ఎస్టేట్ వ్యాపారి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తూ బాటను మూసివేశాడు. గ్రామస్తులు అందరూ కలిసి గత మూడు రోజులుగా బాటను సరిచేయాలని కోరుతూ బాట వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నారు మాదాని ఇన్నాసమ్మ.


నీకు నాకు సుమారు 70 సంవత్సరాలు ఉన్నాయని, నేను పుట్టినప్పటినుంచి ఈ బాటని నడుస్తున్నానని, భయభ్రాంతులకు గురి చేస్తూ మాధవరావు అనే వ్యక్తి బాట అభ్య చేస్తున్నారని ఆరోపించారు

# జూలై 7న చలో ఈదుముడి: ఎమ్మార్పీఎస్



పెద్దవూర :అమృత్ తెలంగాణ: జులై 07 న జరిగే చలో ఈదుముడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు ముది గొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం సాగర్ నియోజకవర్గం పెద్దవూర మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా వెంకటేష్ మాదిగ పిలుపుమేరకు ఛలో ఈదుముడి వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేసి, మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామం లో 21 మందితో మొదలైన ఎమ్మార్పీఎస్ ఉ ద్యమం జాతి ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణతో పాటు సమాజంలో ఉన్నటువంటి అనేక వర్గాల సమస్యల మీద పోరాటాలు చేసిందని అన్నారు. వృద్ధులు, వితంతువులకు, ఆసరా పింఛన్ల పెంపు, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవాడి కి 6 కేజీల బియ్యం పెంపు, వంటివి ఎన్నో సాధించుకున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల అమలు, ఆరోగ్యశ్రీ కార్డు , తెలంగాణ ఉద్యమ సాధనతో పాటు, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటివి జరిగాయని అన్నారు. ఇలా అనేక అంశాల మీద పోరాటం చేసి సాధించిన ఘనత ఎంఆర్పిఎస్ కే దక్కుతుందని తెలిపారు. జూలై 7 నాటికి 31వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మాదిగల పుణ్యక్షేత్రమైన ఈదుముడి గ్రామంలో జరిగే బహిరంగ సభకు రాష్ట్రంలోని నలుమూలల నుండిఅధిక సంఖ్యలోతరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆది మల్ల శ్రీనివాస్ , ముదిగొండ శ్రీను , దుబ్బ వెంకటయ్య ,అనుముల మేరయ్య , చనగళ్ల వెంకన్న ,బుడిగపాక విష్ణు , బుడిగపాక కార్తీక్ , సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్ లైట్ వెలుగులో వైద్యం



మంచిర్యాల : అమృత్ తెలంగాణ: జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జెనరల్ హాస్పిటల్ కరెంటు సమస్యతో విలవిలలాడుతోంది. టార్చ్ లైట్ లు, సెల్ఫోన్ల వెలుతురులో సిబ్బంది వైద్యం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గురువారం రాత్రి విద్యుత్ లో అంతరాయం ఏర్పడింది. సమయానికి జనరేటర్ లో సాంకేతిక లోపం ఏర్పడడంతో దాదాపు 20 నిమిషాల పాటు కరెంటు రాలేదు. దీంతో పెషేంట్ లు, సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్లో ఇది ఏదో ఈ ఒక్కరోజు ఏర్పడ్డ సమస్య కాదు.. నిత్యం వెంటాడుతున్న సమస్యే. అయినా శాశ్వత పరిష్కారం కోసం అధికారులు పట్టించుకోవడం లేదని ఆస్పత్రికి వచ్చిన రోగులు వాపోతున్నారు. మంచిర్యాలతో పాటు పక్క జిల్లాల నుండి నిత్యం రోగులు ఈ హాస్పిటల్ కు చికిత్స కోసమని వస్తుంటారు. అలాంటి హాస్పిటల్ లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సమయానికి స్పందించే వారే లేరంటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమర్జెన్సీ, వెంటిలేటర్ లపై ఎవరైనా పేషంట్ లు ఉ ంటే వారి ప్రాణాలు గాలిలో కలవాల్సిందేనా స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# గ్రామాల్లో కోనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

ముధోల్ : అమృత్ తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకం కింద ఇండ్ల నిర్మాణం ముధోల్ మండలంలోని చురుకుగా కోనసాగుతున్నాయి. మండలానికి 489 ఇండ్లు మంజూరు అయ్యాయి. ఇళ్లను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలు ఇవ్వడంతో ఎంపీడీఓ, హౌసింగ్ అధికారులు, పల్లెబాట పట్టారు. ప్రతిరోజు ఇండ్ల పురోగతిపై కలెక్టర్ అడిగి తెలుసుకోవడమే కాకుండా, సమీక్ష సమావేశాలు నిర్వహిస్తుంది. దీంతో ఎంపిడిఓ , పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు ఉరుకులు,పరుగులు పెడుతున్నారు. ఇందిరమ్మ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులను ఎంపిడిఓ, హౌసింగ్ అధికారులు, ఇందిరమ్మ కమిటీల సహకారం తో లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పిస్తున్నారు. ఇందిరమ్మ పథకం నిబంధనలను తెలియజేస్తున్నారు.ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలను మంజూరు చేస్తుంది. విడుదల వారిగా బిల్లుల వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. బేస్మెంట్ పూర్తి అయిన వెంటనే లక్ష రూపాయలు, గోడల నిర్మాణం తర్వాత లక్ష, స్లాబ్ తర్వాత రెండు లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తిగా అయిన తర్వాత లక్ష రూపాయల, డబ్బు లు లబ్ధిదారుల అకౌంట్లో జమ అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో లబ్దిదారులు ఇండ్ల నిర్మాణంకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే మండలంలో ఇండ్లు 241 ఇండ్ల పనులు చురుకుగా



కొనసాగుతున్నాయి. అధికారులతో పాటు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కూడా, లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఈ విషయం పై ఎంపీడీఓ శివ కుమార్ గురువారం నవతెలంగాణతో మాట్లాడారు. ఇప్పటికే యాబై శాతం ఇండ్ల పనులు కొనసాగుతున్నాయి. మీగితా ఇండ్ల నిర్మాణం పనులను లబ్దిదారులు కట్టుకునే విధంగా చర్యలు చేపడుతున్నమని తెలిపారు.

# ఫీజుల దోపిడి అరికట్టాలి..

## కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివరాజ్



హుస్నాబాద్ :అమృత్ తెలంగాణ: సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు హుస్నాబాద్ పట్టణంలోని అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని గుర్తింపును రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ జిల్లా కలెక్టర్ కు గురువారం హుస్నాబాద్ లో వినతి పత్రం ఇచ్చారు. ప్రయివేట్ స్కూల్లో జరుగుతున్న ఫీజుల దోపిడి పై కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు ప్రయివేట్ పాఠశాలల లోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, టైలు, బెల్టులు,అధిక ఫీజులకు విక్రయిస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులకు మోసం చేస్తున్నారని, ఎలాంటి విద్యా ప్రమాణాలు పాటించడం లేదని వివరించారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా, వ్యాపారమే ధ్యేయంగా ప్రయివేట్ స్కూల్ యాజమాన్యలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఫీజుల కట్టడిపై పై చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ స్కూల్స్ పై తనిఖీలు చేపట్టే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించాలని కోరారు.

# పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

దుబ్బాక : అమృత్ తెలంగాణ: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, "100 డేస్ - 50 ప్రోగ్రామ్స్" అన్న కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్ తెలిపారు. అందులో భాగంగానే గురువారం దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట పదో వార్డులో బహిరంగ ప్రదేశాలు, ఓపెన్ ప్లాట్లలో నిలిచి ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేశామన్నారు. డీఆర్ సీసీ నిర్వహణ, దోమల నియంత్రణకు ఫాగింగ్, మాస్ క్లీనింగ్ వంటి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మున్సిపల్ ప్రజలు తమ ఇంటి పరిసరాలతో పాటు చుట్టుప్రక్కలా, ఆరుబయట, మురికి కాలువల్లో చెత్తను పడేయకుండా.. మున్సిపాలిటీకి చెందిన చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించి స్వచ్ఛ దుబ్బాక కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట ఇన్చార్జి శానిటరీ ఇన్ స్పెక్టర్ దిలీప్, వర్క్ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్, మున్సిపల్ సిబ్బంది పలువురున్నారు.



# ఓటరు నమోదు.. సవరణలో బీఎల్ఓలే కీలకం

దుబ్బాక :అమృత్ తెలంగాణ: నూతన ఓటరు నమోదు, ఓటర్ కార్డులో తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలో బీఎల్ఓ (బూత్ లెవెల్ ఆఫీసర్) లే కీలకమని, ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పక్కా ప్రణాళికతో బీఎల్ఓ లకు మాస్టర్ ట్రైనర్లు మధుసూదన్, ఉమాశంకర్, శ్రీనివాస్ లతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తహశీల్దార్ ఈ.సంజీవ్ కుమార్ చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ఐఓసీలో ఏర్పాటుచేసిన దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని బీఎల్ఓ ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3 నుంచి 17 వరకు అన్ని



మండలాల్లో బీఎల్ఓ లకు తేదీల వారీగా షెడ్యూల్ ప్రకటించి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా బీఎల్ఓ లకు ఆన్ లైన్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని, పకడ్బందీగా ఓటర్ లిస్ట్ ను తయారు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ హరికిషన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవల్ ఆఫీసర్లు, పలువురు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

హుస్నాబాద్ రూరల్ : అమృత్ తెలంగాణ: హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై మండల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. హుస్నాబాద్ రింగ్ రోడ్డు ప్లానింగ్ చేసి మూలమలుపులు ఎక్కువగా లేకుండా వాహనదారులు సులభంగా వెళ్లేందుకు మ్యాపింగ్ చెయ్యాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి 4 వరసల రహదారి నిర్మాణం పనులు ఆయా శాఖల అధికారులు వేగంగా పర్మిషన్ లు ఇవ్వాలని, టెండర్ విధానం పూర్తి చేసి రోడ్లు ఇరువైపుల చెట్లు నరకడం, తొలగించడం ఈ నెల చివరకల్ల పూర్తి చేయాలని పేర్కొన్నారు . రోడ్డు పనులు మొదలవ్వాలని ప్రతి పని ఒక టైం ఫ్రేమ్ పెట్టుకుని పనిచేయాలని అర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అంతక్కపేట లో 220కెవి విద్యుత్ జంక్షన్ 10 ఎకరాల స్థలం ఉందని ట్రాన్స్కో అధికారులు వెంటనే ఆయా అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లెలగడ్డ వద్ద శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల కు సంబంధించిన స్థల సేకరణ పూర్తీ చేశామని తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని అనుమతులు రాగానే ఇంజనీరింగ్ అధికారులకు అందిస్తామని అన్నారు.

# అలా చూడటం చాలా తప్పంటున్న సంయుక్త మీనన్!



గ్లామర్ షో అంటే.. చిట్టి పొట్టి దుస్తులను ధరించడమే అని నమ్మేవారు ఎందరో ఉన్నారు. కానీ గ్లామర్ ను డ్రెస్ తో కనెక్ట్ చేసి చూడటం చాలా తప్పంటోంది సంయుక్త మీనన్. మలయాళంకు చెందిన ఈ ముద్దుగుమ్మ.. 2016 లో 'పాప్ కార్న్' అనే మూవీతో సినీ కెరీర్ ను ప్రారంభించింది. ఆ తర్వాత మలయాళంలో వరుస సినిమాలు చేస్తూ తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ బ్యూటీ.. 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో సాగర్ కె.చంద్ర ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఇందులో రానా భార్య పాత్రను పోషించిన సంయుక్త.. తనదైన నటనతో మంచి మార్కులు వేయించుకుంది. ఇక త్వరలోనే ఈ అమ్మడు 'బింబిసార'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధం అవుతోంది. ఇందులో నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తే.. మల్లిడి వశిష్ట దర్శకత్వం వహించాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్పై హరికృష్ణ నిర్మించిన ఈ సినిమాలో కేథరిన్ థ్రెసా సంయుక్త మీనన్ హీరోయిన్లుగా నటించారు. మగధ రాజ్యాధిపతి అయిన బింబిసారుడు జీవితం ఆధారంగా ఈ మూవీని రూపొందించారు. ఇందులో కళ్యాణ్ రామ్ ద్విపాత్రాభినయం చేశాడు. భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రం ఆగస్టు 5న అట్టహాసంగా విడుదల కాబోతోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో.. ఓవైపు వరుస అప్డేట్స్ మరోవైపు ప్రచార కార్యక్రమాలతో మేకర్స్ సినిమాపై మంచి బజ్ ను క్రియేట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే సంయుక్త మీనన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ సందర్భంగా ఆమె వృత్తిపరమైన విషయాలే కాకుండా వ్యక్తిగత విషయాలను సైతం షేర్ చేసుకుంది. నటిని అవుతానని అనుకోలేదని అనుకోకుండా అవకాశం రావడంతో సినిమాలు చేశానని చెప్పుకొచ్చిన సంయుక్త.. మలయాళంలో తాను చేసిన సినిమాలు మంచి గుర్తింపును తీసుకొచ్చాయని తెలిపింది. అలాగే తెలుగులో తొలి అవకాశం 'బింబిసార'లోనే వచ్చినా.. 'భీమ్లా నాయక్' మొదట విడుదలైందని వివరించింది. ప్రస్తుతం సాయి ధరమ్ తేజ్ తో ఓ సినిమా ధనుష్ తో 'సార్' మలయాళంలో ఓ పెద్ద సినిమా చేస్తున్నట్లు ఆమె తెలిపింది.

# ఐటం పాటల్లో శ్రీలీల.. కిసిక్ బ్యూటీ కండీషన్ అప్పై!



కిసిక్ పాటతో శ్రీలీల పాన్ ఇండియాలో ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఒక్క పాట అమ్మడిని రాత్రికి రాత్రే ఫేమస్ చేసింది. కిసిక్ పాటతో శ్రీలీల పాన్ ఇండియాలో ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఒక్క పాట అమ్మడిని రాత్రికి రాత్రే ఫేమస్ చేసింది. ఎంతో మంది భామలున్నా ఆ ఛాన్స్ సుకుమార్ కేవలం శ్రీలకు మాత్రమే ఇచ్చాడు. అమ్మడు కూడా ఆ నమ్మకాన్ని అంతే నిలబెట్టుకుంది. మాస్ అప్పిరియన్స్ తో కుర్రాకారు హృదయాలు దోచేసింది. కిసిక్ లాంటి పాటలు చేయాలంటే? అది శ్రీలీలతో మాత్రమే సాధ్యమవుతుందని ఒక్క పాటతోనే పాన్ ఇండియాకి చాటి చెప్పింది. పుష్ప-2 తో అంతటి సంచలనాన్ని నమోదు చేసింది. అయితే ఆ పాట తర్వాత చాలా మంది తనని ఐటం పాటల్లో నటించమని అడిగారుట. అడిగినంత పారితోషికం చెల్లించడానికి రెడీగా ఉన్నారంది శ్రీలీల. తాను ఎస్ చెప్పాలే గానీ కోట్ల రూపాయలు తన అకౌంట్ లో జమ అవుతాయని తెలిపింది. కానీ వచ్చిన చాలా అవకాశాలు ఇష్టం లేక వదులుకున్నానంది. కేవలం కొన్ని సినిమాల్లో మాత్రమే అలాంటి పాటల్లో నర్తిస్తానని...డబ్బులిస్తారని ఏ సినిమా పడితే ఆ సినిమాలో అలాంటి పాటల్లో నటించనని తెగేసి చెప్పిందిట. ఐటం పాటల్లో నటించిన తనకంటూ కొన్ని కండీషన్లు ఉన్నాయని...

వాటికి లోబడే పని చేస్తానని తెలిపింది. జాతీయ స్థాయి చిత్రాల్లో నటించాలనే ఆశను వ్యక్తం చేసింది. అలాంటి సినిమా అవకాశాలు వస్తే వదులుకోనని తెలిపింది. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగు అమ్మాయిగా తనని గుర్తిస్తున్నారంది. ఇతర భాషల్లో అవకాశాలు వచ్చినంత మాత్రాన తెలుగు సినిమాలకు దూరమవుతానని అనుకోవద్దు. తన మొదటి ప్రాధాన్యత తెలుగు సినిమాలకేనని తెలిపింది. తెలుగులో పాటు ఇతర భాషల అవకాశాల్ని బ్యాలెన్స్ చేస్తూ కెరీర్ లో ముందు కెళ్తానని స్పష్టం చేసింది.

# 'ఛావా' కారణంగా నాగ్‌పూర్ అల్లర్లు.. టెన్షన్‌లో నటి!

ఇప్పుడు స్వరా 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రెండు ట్వీట్లు దుమారం రేపుతున్నాయి. చాలా కాలంగా పరిశ్రమకు దూరంగా ఉన్న బాలీవుడ్ నటి స్వర భాస్కర్ ఇండస్ట్రీలో పలు అంశాలపై నిరంతరం సోషల్ మీడియాల్లో తన అభిప్రాయం చెబుతున్నారు. వీటిలో కొన్ని వివాదాల్ని కూడా మోసుకొస్తున్నాయి. ఇప్పుడు స్వరా 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రెండు ట్వీట్లు దుమారం రేపుతున్నాయి. వీటిలో నాగ్‌పూర్ అల్లర్లకు 'ఛావా' సినిమానే కారణం అని ఒక ట్వీట్ లో పేర్కొనగా, మరొక ట్వీట్‌లో నటుడు కునాల్ కమ్రాను ప్రశంసిస్తూ, ఏక్‌నాథ్ షిండే కి వ్యతిరేకంగా ట్వీట్ చేయడం హాట్ టాపిగ్గా మారింది. స్వరా పోస్టలలో ఒకదానిలో "ఛావా చిత్రం రెచ్చగొట్టేది. విక్కీ కౌశల్ - నిర్మాతలు నాగ్‌పూర్ అల్లర్లకు బాధ్యులు. ఈ చిత్రాన్ని భారతదేశం అంతటా నిషేధించాలి" అని రాశారు. అదే సమయంలో రెండవ ట్వీట్‌లో "కునాల్ కమ్రా కామెడీ షో ఒక కళ" అని రాశారు. షిండే మద్దతుదారులే ఈ విధ్వంసానికి బాధ్యులు! అని కూడా ట్వీట్ లో రాసారు. ఈ రెండు ట్వీట్లు ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఇవి ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అయితే నెటిజనుల నుంచి ఊహించని విమర్శలు ఎదురవ్వడంతో స్వరా తాజాగా దీనిపై స్పందించారు. ఈ ట్వీట్‌లను తాను చేయలేదని, ఇవన్నీ నకిలీ ట్వీట్లు అని పేర్కొన్నారు. దయచేసి వాస్తవాలను తెలుసుకోండి అని కూడా స్వరా అభ్యర్థించారు ఫేక్ పోస్ట్‌లకు సంబంధించిన కొన్ని స్క్రీన్‌షాట్‌లను స్వరా షేర్ చేసారు. మూర?పు రైటిస్టులు మళ్ళీ వారు చేయగలిగినది చేయడం ప్రారంభించారు




# మాళవిక అందం పాల మీగడ సొగసు!



నటి కం మోడల్ మాళవిక శర్మ టాలీవుడ్ లో పెద్ద కెరీర్ ని ఆశిస్తున్న సంగతి తెలిసిందే. కానీ కాంపిటీషన్ లో రయ్ మని దూసుకెళ్లడానికి చాలా సమయం పడుతుందని అర్థం చేసుకుంది. ఈ బ్యూటీ ప్రస్తుతం న్యాయశాస్త్రంలో పట్టా పొంది లాయర్ గా ప్రాక్టీస్ చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు నటనను వాణిజ్య ప్రకటనల రంగాన్ని విడిచిపెట్టడం లేదు.సోషల్ మీడియాల్లోనూ చాలా యాక్టివ్ గా ఉండే మాళవిక శర్మ తరచూ తన ఫోటోషూట్లను అభిమానులకు షేర్ చేస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com